# 'దిల్ మే రామ్, హాత్ మే కామ్'

**కంటిగ్రుడ్డుకు కాటుక అంటనట్లు**
**జిడ్డునెవ్విధి జిహ్వను జేరనట్లు**
**బురదనెవ్విధి కమలము చేరనట్లు**
**దేనినంటక యుండుటె ఆత్మయగును**

**ప్రేమస్వరూపులారా!**

భగవంతుడు అద్వితీయుడు. 'ఏకోహం బహుస్యాం' అని సంకల్పించుకొని, తనకు తానే అనేక రూపములు ధరించి తనయొక్క విచిత్రమైన అమోఘమైన, అద్భుతమైన యీ జగత్తును గుర్తించే నిమిత్తమై జీవులకు కర్మ, భక్తి, జ్ఞానమనే మూడు మార్గములను ఉపదేశించడం జరిగింది, భగవద్గీతలో. అమోఘమైన అద్భుతమైన యీ ప్రకృతియొక్క రహస్యాన్ని గుర్తించే నిమిత్తమై మానవుడు అనేక విధములైన ప్రయత్నములు చేస్తూ అన్వేషిస్తూ వచ్చాడు. అయితే మనో చిత్త అహంకారములే అతని ప్రయత్నమునకు అడ్డు తగులుతూ వచ్చాయి. ఫలితంగా నిత్యసత్యమైన జగత్తును గుర్తించుకొనలేక మనస్సును అయోమయము గావించుకొనుచున్నాడు మానవుడు. సర్వత్ర వున్నది ఒక్కటే అని ఏకత్వమును గుర్తించుకోలేకపోతున్నాడు. దీనిని పురస్కరించుకొనియే గీతలో 18వ అధ్యాయమునందు 61వ శ్లోకములో

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా**

అని చెప్పబడింది. అంతటితో ఆగక తిరిగి 62వ శ్లోకమందు ' తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత', అని కృష్ణుడు స్పష్టం చేశాడు. అనగా సర్వభూత హృదయములందు వుండినవాడు తానే అయినప్పుడు అర్జునుని హృదయమునందుకూడా తానే వుండవలెను కదా! కనుకనే



srisathyasaivechanamrutam

'తమేవ శరణంగచ్ఛ' అన్నాడు. అనగా నిన్ను నీవు శరణు జొచ్చుకోమన్నాడు. ఇట్టి సత్యమును అర్థము చేసుకున్న వ్యక్తులు తాము ఏమి చేసినప్పటికిని, మంచి చేసినా చెడ్డ చేసినప్పటికిని, తమకు తాము చేసుకోటమేగాని పరులకు చేయటము కాదనే సత్యమును గుర్తించుకోవచ్చును. 'తం యేవ' ఆ నీయొక్క తత్త్వమునే నీవు ఆశ్రయించమన్నాడు. 'తత్' పదార్థము 'త్వం' పదార్థముయొక్క సమ్మిళితమైన స్వరూపము. యీ రెండింటి కలయికయే మానవత్వమని చక్కగా అర్థమవుతుంది.

**ధర్మక్షేత్రమనగా ఆత్మస్థానమే!**

భగవద్గీత ప్రారంభమునందు 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' అను పదముతో ప్రారంభించాడు, ధృతరాష్ట్రుడు. ధర్మక్షేత్రమనగా యేమిటి? ధర్మక్షేత్రమనగా ఆత్మస్థానమే! కురుక్షేత్రమనగా పాపకర్మలు ఆచరింపజేసే యీ దేహమునకే కురుక్షేత్రము అని పేరు. కనుక ధర్మక్షేత్రమనగా ఆత్మ అనియు కురుక్షేత్రమనగా దేహమనియు యిది ఆత్మ, అనాత్మ సమ్మిళితమైన చైతన్య స్వరూపమే మానవ దేహమనియు మనము అర్థము చేసుకోవాలి. ఇది క్షేత్ర, క్షేత్రజ్ఞ స్వరూపములో వుండిన మానవత్వము. కాని యిట్టి దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన మానవత్వాన్ని ఈనాడు మరచి స్వధర్మమంటే యేమిటో పరధర్మమంటే యేమిటో అర్థము చేసుకోలేని పరిస్థితిలో మానవుడు కొంతవరకును కాలమును దుర్వినియోగము చేసుకొనుచున్నాడు.

స్వధర్మాన్ని విసర్జించి పరధర్మాన్ని విశ్వసించి యేది సత్యమో యేది అసత్యమో అనే విచారణ శూన్యులై అశాంతికి గురౌతున్నాడు, మానవుడు. తాను అనుభవించే యీ సమస్త కష్టములకు, దుఃఖములకు, విచారములకు మూలకారణము స్వధర్మమనే ఆత్మధర్మమును వదలి దేహధర్మము ననుసరించటమే! కామ, క్రోధ, లోభ మద, మాత్సర్యములు అనే కాలచక్రమునందుపడి మానవుడు అనేక కష్టములకు గురౌతున్నాడు. తాను సత్యస్వరూపుడనే సత్యాన్ని మరచిపోతున్నాడు. 'సత్యస్యసత్యమ్' అనే తత్త్వాన్ని విస్మరిస్తున్నాడు. తాను కేవలము సత్యస్వభావుడే కాకుండా ఆనందపిపాసి అనే విషయాన్నికూడను తాను మరచిపోతున్నాడు. ఈ సత్యమును విస్మరించటంచేతనే తాను దుఖించవలసిన దానికి దుఃఖించక, దుఃఖించతగనిదానికై దుఃఖిస్తున్నాడు. మానవుడు. రెండవ అధ్యాయమునందు పదకొండవ

sri sathyasai vachanamrutam

శ్లోకములో అనేక విధములుగా బోధించాడు కృష్ణుడు. దుఃఖింపతగని విషయమునకు మనము దుఃఖిస్తున్నాము. కారణమేమిటి? ఉపాధియే మనయొక్క ఆకారమనియు జీవితములో దేహమే మన సర్వస్వమనియు భ్రమించి పాంచ భౌతికమైన ఈ దేహము నిమిత్తమై సమస్త కర్మలు ఆచరించటానికి ప్రయత్నం చేయటంచేత యీ ఆశాభంగముయొక్క ప్రతిఫలమే మన దుఃఖములకు మూలకారణము. అదే తిరిగి 18వ అధ్యాయములో చెప్పాడు, కృష్ణుడు. నీవు దుఃఖింపనవసరము లేదు. ఈ దుఃఖమునకు కారణం ఏమిటి? సమస్త వస్తువులు, సమస్త జీవులు, సమస్త కర్మలు నీవే! నీ నిజతత్త్వాన్ని గుర్తించుకొనలేక, 'నేను' అనే దివ్యత్వమైన ఆత్మతత్త్వము సర్వత్ర వ్యాపించి వున్నదనే సత్యము నీకు తెలియక పోవటమే దుఃఖమునకు మూలకారణము.

భగవద్గీతలో ధృతరాష్ట్రుడు తన కుమారులు, పాండు కుమారులు యుద్ధభూమిలో ఏమి చేస్తున్నారనే ప్రశ్నతో ప్రారంభించాడు. ధృతరాష్ట్రుడు అంధుడు. అంధుడనగా యేమిటి? కేవలము చర్మ చక్షువులు లేకుండా పోయినంత మాత్రమున అంధుడు కాదు. ఏకత్వమును అనేకత్వముగా విశ్వసించి దానిని అనుసరించినవాడే అంధుడు. తనది కానిదానిని తనదిగా భావించేవాడే అంధుడు! ఈ దేహమే నేను అనే భావముచేత తాను జీవితమును గడపటానికి ప్రయత్నించేవాడే అంధుడు. రాగద్వేషాలకు గురియై కేవలము అజ్ఞానములో మునిగినవాడే అంధుడు. ఉన్నది ఒక్కటే అయినప్పటికిని దానిని అనేక రూపములలో చూచుచున్నాడు. అదే అంధత్వమునకు మూలకారణము.

**కన్నులుండియు గ్రుడ్డులై కళ్యాణకరమైన**
**నీరూపు దర్శింపనేరరైరి.**

**ఏకాత్మ భావమును అర్థము చేసుకుంటే విచారమునకు అవకాశమే ఉండదు**

కన్నులున్నవిగాని చూచే పదార్థములన్నియు సత్యముగా భావిస్తున్నాడు మానవుడు. ఇవన్నీ ఏనాటికైననూ మార్పుచెందేవే! కదలిపోయే మేఘములు వంటివే. ఒక్కటీ స్థిరమైనదికాదు. ఈ సత్యాన్ని మానవుడు గుర్తించుకుంటే విచారించటానికి యేమాత్రము అవకాశము వుండదు. ఏకాత్మ భావమును అర్థము చేసుకుంటే విచారమునకు అవకాశమే వుండదు.

srisathyasaivachanamrutam

**మహిమ సర్వము ఈశ్వర మయము కనుక**
**నాదియును మమత్వంబు వ్యర్థంబుగాదె**
**అనర్థంబు గాదె.**

సర్వత్ర నిండిన తత్త్వము ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించుకున్నప్పుడు 'యిది నాది, యిది నీది' అనే భిన్నత్వమునకు అవకాశమే వుండదు.

**తనయందు, పరులయందు ఒకే పరతత్త్వమున్నదనే సత్యమును గుర్తించాలి**

'మామకాః పాణ్డవాశ్చైవ' అనగా నా వారు, పాండవులు అనే మమత్వమే దుష్టగుణములకు మూలకారణము. మూలాధారమైన గమ్యము ఒక్కటే! సమస్త కర్మల గమ్యము ఒక్కటే! సమస్త ధర్మముల గమ్యము ఒక్కటే! మార్గములు వేరు, గమ్యము ఒక్కటే. అదే విధముగనే మానవుడు ఆచరించే కర్మలుగాని, ఉపాసనగాని, జ్ఞానము గాని గమ్యమును చేర్చునవే! అయితే యీ ధర్మకర్మ అనే దానికి భగవద్గీత మరొక సూక్ష్మమైన అర్థాన్ని బోధిస్తూ వచ్చింది. ఎవరు ధన్యులు? అనే ప్రశ్నకు అకర్మలో కర్మను, కర్మలో అకర్మను చూచిన మహనీయుడే ధన్యుడు అన్నారు. కర్మలో అకర్మను చూడటం అంటే యేమిటి? కర్మలంటే దేహము. సర్వకర్మలకు మూలాధారమైనదే యీ దేహము. కర్మఫలములవల్ల నశించునట్టిదే యీ దేహము. తిరిగి కర్మఫలము అనుభవించటానికి పుట్టేదే యీ దేహము. కనుక దేహమనే కర్మలో అకర్మ అనే ఆత్మను చూచినవాడు ధన్యుడని చెప్పింది. కర్మయందు అకర్మను చూచి అకర్మ యందు కర్మను చూడాలి, అన్నారు. తన దేహమందు వున్న ఆత్మనే కాకుండా ఇతరుల దేహమునందు వున్న ఆత్మనుకూడను దర్శించటానికి ప్రయత్నించినవాడు ధన్యుడు, అన్నారు. అనగా నీ యందు యే విధమైన పరతత్త్వము వున్నదో అదే పరతత్త్వము ప్రతివ్యక్తియందు వున్నదనే సత్యాన్ని గుర్తించాలి. అదే 'ఈశావాస్యమిదం సర్వమ్'. అట్టి పరిస్థితియందు మానవుడు పరులను బాధించకుండా, యేవిధమైన కష్టములకు గురికావించకుండా చూచుకోటానికి, ప్రేమించటానికి చక్కని అవకాశము యేర్పడుతుంది. ఎవరిని బాధించినా భగవంతుని బాధించినట్టే! ఎవరిని గౌరవించినా భగవంతుని గౌరవించినట్టే! కేవలము ఉపాధి భేదములనే మనము భావించి, పోషించి అభివృద్ధి గావించుకొని, అజ్ఞానములో మునగటానికి ప్రయత్నించరాదు. ఈ దేహము

srisathyasaivahini/vachanamrutam

కేవలము పాంచభౌతికమైనది.

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాతసం**
**చలనము పొందుదుంప భవసాగర మీదగ లేని కంప**
**అంబుల పొది లెమ్ము చూడు మనమెప్పు దలంపగ దేహమింక**
**నిశ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే!**

దైవ సన్నిధిని మాత్రము చేరటానికి ఒప్పుకోరు, కారణమేమిటి? 'సంకల్పవికల్పకాత్మకం మనః'. మనస్సు నిరంతరము సంకల్ప వికల్పములతో వుండటంచేత దైవసన్నిధిని చేరడానికి దానికి అర్హత లేదు. ఏనాడు నీ సంకల్పములను నిరోధిస్తావో ఆనాడే నీవు దైవసన్నిధికి అర్హుడవౌతావు. మననాత్మకం మనః' నిరంతరము యేదో ఒకదానిని చింతిస్తూ వుంటుంటావు. ఈ అన్యచింతనతో వుండిన మనస్సుకు దైవచింతన చేయటానికి అధికారము ఎక్కడిది? కారణమేమనగా మానవునికి హృదయము ఒక్కటే! ఇది double sofa కాదు. లేక musical chair కాదు. అటువంటి ఈ హృదయములో ఒక్క దైవత్వమును ప్రతిష్ఠింపచేసుకుంటే అన్యచింతలకు అక్కడ అవకాశమే వుండదు. దురదుష్టవశాత్తు మనము యీనాడు మన హృదయాన్ని musical chair గా ఉపయోగపెడుతున్నాము. కొన్ని దినములు కొంతమందికి చోటివ్వటం, కొన్ని దినములు మరికొంతమందికి చోటివ్వటము. యీ విధముగా మనము మార్పు చేసుకోటంచేత మన జీవితము దిగ్భ్రాంతి పొందిపోతున్నది.

**జగత్తంతయు బ్రహ్మమయమే!**

ఈ జగత్తంతయు బ్రహ్మమయమే! ఇట్టి బ్రహ్మమయమైన జగత్తు కర్మమయమే! నిజానికి జగత్ సృష్టియే ఒకకర్మ; కర్మలను ఆచరించే దేహమే ఒక కర్మ; నీవే కర్మ.

**కర్మమున పుట్టు మానవుడు**
**కర్మముననె వృద్ధిపొంది**
**కర్మముననె చనున్**
**కర్మమె నరునకు దైవము**
**కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో**

కనుక, కర్మలయొక్క తత్త్వము కాయముతో కూడినదేగాని కాయమునకు విరుద్ధమైనదికాదు. కాయముతో ఆచరించే కర్మలన్నీ సత్కర్మలుగా వుంటుండాలి. ఈ కర్మలయొక్క ఫలితముచేతనే మన జన్మములు అభివృద్ధి అవుతూ వుంటాయి. దుష్కర్మల విషయానికి వస్తే 'ఏదో ఒక్కటే నేను చేస్తున్నాను, అనేకము చేయలేదు కదా!' అని నీవు భ్రమించవచ్చును. నిజానికి, దుష్కర్మ ఒక్కటి వుండిన చాలు. యింక ఎన్నైన దానినుండి అభివృద్ధి కావచ్చును. ఒక ముళ్ల విత్తనము వేస్తే అది పెద్ద వృక్షముగా అబివృద్ధి అవుతుంది. ఆ వృక్షములోపల యింక అనేక వేల విత్తనములు వస్తాయి. ఈ అనేక విత్తనములద్వారా తిరిగి అనేక వృక్షములంతా అభివృద్ధి అవుతాయి. అదే విధముగా పండ్ల విత్తనమే నాటుకుంటే ఒక పెద్ద వృక్షముగా మారిపోయి అందులో పండ్ల విత్తనములు అధికముగా అభివృద్ధి అవుతాయి. తద్వారా తిరిగి పండ్ల వృక్షములు అభివృద్ధి అవుతాయి. 'ఏకోహం బహుస్యాం'. ఒక్కటే అనేకముగా రూపొందుతూ వచ్చింది. అనేకముగా వచ్చిన వృక్షములన్నియుకూడను ఏక బీజముతో యేర్పడినవనే తత్త్వమును 'బీజమ్ మాం సర్వభూతానాం' అన్నాడు కృష్ణుడు భగవద్గీతలో. 'అందరి హృదయమునందుకూడను నేను బీజరూపములో వుంటున్నాను. అనగా విశ్వరూపములో వుంటున్నాను.' అని ప్రకటించాడు. కనుక, యీ సత్యమును మనము గుర్తించటానికి ప్రయత్నం చేయాలి. భగవంతుడే ఒక విత్తనము. భగవంతునినుండి ఆవిర్భవించిన జగత్తే పెద్ద వృక్షము. ఈ జగత్తనే మహావృక్షమునందు ఒక్కొక్క దేశము ఒక్కొక్క శాఖ. ఒక్కొక్కశాఖయందు మానవజీవితమనే ఫలములు అనేకంగా అభివృద్ధి అవుతూవచ్చాయి. ఒక్కొక్క మానవుడనే ఫలమందు ఒక్కొక్క ఆత్మ చేరి వుంటున్నది. ఒకే భగవంతుడు అనేక రూపములు ధరించి వుంటున్నాడు. ఆత్మదృష్టితో సమస్త జగత్తును ఏకముగా భావించేటి మహనీయులు కొందరు. దేహదృష్టితో భిన్నముగా భావించుకొని అనేక చిక్కులకు గురి అయ్యేవారు మరికొందరు. అందువలన దేహమును ధరించిన ప్రతి మానవుడుకూడను దేహతత్త్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడ**
**ఆ దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ**

srisathyasaivahini.org

తాను చావక, పుట్టక, చంపబడక అతనే సర్వసాక్షియై వుండినట్టి ఆత్మతత్త్వము. ఏది పుట్టునో అది గతిస్తుంది. దేనికి పుట్టుక లేదో దానికి చావుకూడ లేదు. కనుక, చావుపుట్టుకలు లేని ఆత్మ ఆధారముచేతనే చావుపుట్టుకలతో కూడిన యీ దేహము ఒక డ్రస్సు వేసుకున్నట్టుగా అనగా ఉపాధి ధరించి యీ జగత్తునందు వస్తున్నది. అయితే, మనము మానవులమనే భావము వుండినంతవరకు యీ జగత్తులో కర్తవ్య కర్మలు నిర్వర్తించాలి.

**భగవంతునియందు గల అనురక్తియే భక్తి**

భక్తి అనగా యేమిటి? కేవలము భగవంతునియందు వుండిన అనురక్తియే భక్తి. ఈ అనురక్తి వ్యక్తమయ్యేది కాదు. మన హృదయములోపల దేనికి స్థానమిస్తే దాని ఆకారము మనము పొందిపోతాము. దానివల్లనే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి' అన్నారు. దేనిని మనము చింతించుకుంటామో దాని ఆకారమును మనము పొందుతాము. మనము మంచిని చింతించాలి. మంచిని విచారించాలి. హృదయములోపల చెడ్డను నిరంతరము చింతిస్తూ వుంటే మనకు అన్ని కూడను చెడ్డగానే కనుపిస్తుంటాయి. చెడ్డను చూడకుండా దృష్టిని మనము సరైన మార్గములో ప్రవేశపెట్టాలి. కేవలము దృష్టి ప్రధానము కాదు. దీనికి ద్రష్ట ఆధారము. ద్రష్టను ఆధారము చేసుకున్నప్పుడు సృష్టి అంతయు బ్రహ్మమయముగానే వుంటుంది. ఈ ప్రకృతి మనకు అడ్డముగా వుండినప్పటికి మన దృష్టికి యేమాత్రము భంగము కలిగించదు. ఏ విధముగా? మనము కంటికి అద్దాలు వేసుకున్నాము. ఈ అద్దము కంటికి అడ్డముగా వుందిగానీ దృష్టికి సహాయముగా వుంటుంది. అయితే మన దృష్టికి సంబంధించిన అద్దాలే వేసుకున్నప్పుడు యిది సహాయముగా వుంటుంది మనకు. దృష్టికి సరిపడని అద్దాలు వేసుకున్నప్పుడు మన దృష్టినికూడను పాడుచేస్తుంది. ప్రేమ మన హృదయములో వుంటున్నాదంటే ఆ ప్రేమకు సంబంధించిన భావములే మనలో ఆవిర్భవించాలి. ప్రేమకు విరుద్ధమైన భావములు మనము ఆవిర్భవింపచేసుకుంటే మన జీవితమే అధోగతి పాలవుతుంది. కనుక, మన హృదయాన్ని మొట్టమొదట పరిశుద్ధముగావించుకోటానికి ప్రయత్నించాలి. తిరుత్తొండ ఆళ్వారు చెప్పేవారు. "నా చిత్తశుద్ధిగానే ప్రార్థిస్తున్నాను, స్వామీ! మలినమైన చిత్తముతో కాదు", అని. దీనినే మీరా కూడను "నా హృదయము నీ మందిరము కృష్ణా! నేను యెక్కడకు పోయేది?

srisathyasaivachanamrutam

కనుక, నా హృదయ మందిరములో ప్రవేశించు. నాకీ మందిరాలు అక్కరలేదు". 'చలోరె మన్ గంగా యమునా తీర్' అని చెప్పింది తన మనస్సును ప్రయాగకు పొమ్మని చెప్పలేదు. గంగాయమునా తీర్‌కు పొమ్మని చెప్పింది. 'భ్రూమధ్య స్థానములోకి వెళ్లి చేరు, మనసా', అని మనస్సును హెచ్చరించింది. మార్గము యెలావుంటున్నాది? 'గంగా యమునా నిర్మల పానీ శీతల హోవె శరీర్ చలోరే గంగ' యెట్లుందంటె చాలా పరిశుద్ధముగా వుంటుందట. మహాప్రశాంతముగా వుంటుందట. ఆ ప్రశాంతము, పరిశుద్ధమైన హృదయములో ప్రవేశించమని కోరటమే దీనియొక్క అంతరార్థము. మన హృదయము చూస్తే యీనాడు మాలిన్యముతో నిండి వుంటున్నది. మనస్సు చూస్తే అశాంతితో కుమిలిపోతున్నది, కుళ్లిపోతున్నది, కూలిపోతున్నది. అశాంతి, మాలిన్యము వుండిన హృదయములో యేరీతిగా ప్రవేశించటానికి అంగీకరిస్తాడు భగవంతుడు? కనుక, యే కష్టములు కలిగినా, యే సుఖములు కలిగినా, యివన్నీ భగవత్ విభూతులే అనే అనుభవానికి మనం రావాలి. విభూతి యోగమనగా ఏమిటి? 'సర్వము భగవత్ విభూతులే,' అనే సంపూర్ణ విశ్వాసము కలిగినవానికి చెడ్డదీ భగవంతునియొక్క ప్రసాదమే, మంచిదీ భగవంతునియొక్క ప్రసాదమే! ఏది యిచ్చినా విభూతి ప్రసాదమే! ఆరోగ్యముగా వుండినప్పుడు పంచభక్ష్య. పరమాన్నములు అంతా వడ్డిస్తుంది, అమ్మ. కడుపు చెడిపోయి జ్వరము వచ్చిందంటే పత్యం పెడుతుంది. అమ్మ యింట్లో పత్యం పెడుతున్నదని డాక్టరు దగ్గరకు పోతే అతను చేదుమందు యిస్తాడు, జ్వరము పోవటానికి. ఆ డాక్టరుకు నీపై యేమాత్రము ద్వేషము లేదు. నీవంటె అసూయ లేదు. కానీ, నీ రోగ నివారణ చెయ్యాలనే ఆ చేదుమందు యిచ్చాడు. డాక్టరు అంటే యేమి? 'వైద్యోనారాయణో హరి'. నారాయణ తత్త్వముతో కూడినది యీ వైద్యము. కనుక, అజ్ఞానమనే రోగములో మునిగే నిన్ను కొన్ని విధములైన సుజ్ఞాన అస్త్రములచేత శిక్షించవలసివస్తుంది. తాను శిక్షించినంతమాత్రమున నీపై ద్వేషముగాని లేక నీపై క్రోధమనిగాని, నీపైన అయిష్టమనిగాని భావించరాదు. అనుగ్రహముతోనే ఆగ్రహమును చూపుతున్నాడు. కడుపులో నొప్పి పుట్టింది. ఆ నొప్పిని భరించుకోలేక డాక్టరు దగ్గరకు వెళ్లాడు. అయితే డాక్టరు దీనికి తక్షణమే ఆపరేషన్ చేయాలని నిర్ణయము చేశాడు. అతను కత్తి తీసుకున్నాడు. పొట్టను కోశాడు. అందులో వున్న దోషమును తీసివేశాడు. నీ కడుపులో పుట్టిన నొప్పిని పోగొట్టుకోవాలంటే డాక్టరు పెట్టిన

sri sathyasai vachanamrutam

నొప్పిని అనుభవించాలా, వద్దా? పెట్టిన నొప్పిని భరించినప్పుడే, పుట్టిన నొప్పి పోతుంది నీకు. సుఖముచేత మనకు సుఖము లభించదు. దుఃఖముచేత సుఖము లభిస్తుంది.

**'ఏది వచ్చినా మన మంచికే' అనే సద్భావమును పెంచుకోవాలి**

దుఃఖములు, బాధలు, నిందలు, నిష్ఠూరములు యివన్నీ మన మంచికోసమే వచ్చేది. ఏమి వచ్చినా మనమంచికే అనే సద్భావము మనము అభివృద్ధిపరచుకోవాలి. ఇది చాలా పవిత్రమైన భావము. ఈ భావమును మనము వహించినప్పుడు ఏ బాధలు మనలను తొందరపెట్టవు. ప్రతి కష్టముకూడను మన మంచికోసము ఏర్పడినది. ప్రతి కష్టము ఉన్నతస్థాయికి కొనిపోయేదే! పవిత్రమైన స్థానమునకు ప్రతి బాధకూడను సోపానములే!

**కష్టసుఖములు రెండును కలసియుండు**
**దీని విడదీయ యెవ్వని వశము కాదు**
**సుఖము ప్రత్యేకముగ యెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖమంద్రు.**

కష్టసుఖములు ప్రత్యేకమైనవి కాదు. ఒకటి ప్రారంభము, రెండవది అంత్యము. అమావాస్య ప్రారంభమైన తరువాత 15 రోజులలో పౌర్ణిమ వస్తుంది. తిరిగి పాడ్యమి తరువాత అమావాస్య వస్తుంది. కాలచక్రములో అన్నీ మార్పు చెందేవే! యివన్నీ దైవనిర్ణయాలు. జగత్ సృష్టి యెప్పుడూ దైవనిర్ణయమే అనే సత్యాన్ని మనము గుర్తించాలి. 'నేను చేస్తున్నాను, నేను అనుభవిస్తున్నాను', అనే యీ అహంకారము నిర్మూలము చెయ్యాలి. అహంకారము వుండినంతవరకు ఆత్మభావము మనలో ప్రవేశించదు. అహంకారి ఆత్మను చూడలేడు. కనుక, మనము అహంకారమనే దానిని మొట్టమొదట చంపటానికి ప్రయత్నించాలి. అదే నిన్ను బాధలు పెట్టేది. ఈ అహంకారము ఏమిటి? అంతయు ఒక భ్రమనే! ఈ భ్రమనే మనము 'నేను', 'నేను', అనే రీతిలో పెంచుకుంటూపోతున్నాము. నేను సంసారిని అనుకోటం ఏమిటి? అది భ్రమే! తరువాత, 'సంసారి' అనే భ్రమను వదలిపెట్టి 'సన్యాసి' అనే భ్రమను తగిలించుకున్నావు. ఇది ఒక్క చొక్కా వదలి యింకో చొక్కా తగిలించుకోటం.ఇవన్నీ డ్రస్సులే. ఇవన్నీ తెచ్చిపెట్టుకున్నవిగానీ పుట్టుకతో వచ్చినవి కావు. పుట్టుకతో వచ్చినదే గతించిపోతుంటే తెచ్చిపెట్టుకొన్నది ఎంత

sri satyasai vachanamrutam

కాలము వుంటుంది? ఉన్న ముక్కే వూడిపోతుంటే పెట్టిన ముక్కు ఎంతకాలము వుంటుంది?

**తుమ్మునంతలో తూలిపోవు నీ**
**తొమ్మిది తొట్లల తోలుబొమ్మ**
**తై తై తై తై తై బొమ్మ**
**దీని తమాష చూడర మాయ బొమ్మ**

ఈ తోలుబొమ్మయొక్క తత్త్వాన్ని మనము యింతవరకుకూడను అర్థము చేసుకోకుండాపోతే యింక ఏనాడు మనము అర్థము చేసుకునేది?

**అందము ప్రాయము యింద్రియ శక్తియు**
**ఉందని నిక్కకు రోరన్నా**
**ముందున్నదిరా తొందరలోనే**
**ముసలితనమ్మను ముసళ్ళ పండుగ**

ఎంతకాల మీ దేహము?

**మసలలేవు కను మసకలు మోమున**
**ముడతలు బడె తల నెరిసెనుగా**
**ముసలి కోతియని పసివారలు నిన్**
**ముసి ముసి నవ్వగ కసరుకొనే ఓ**
**తై తై తై తై తై బొమ్మా**
**దీని తమాష జూడర మాయ బొమ్మా**

ఎంతకాలము నీవు యవ్వనములో వుంటావు? ఏదో ఒకనాడు నీకు తల నెరుస్తుంది. శరీరము ముడతలు పడుతుంది. కళ్లు కానలేకుండాపోతాయి. ఈ పరిస్థితులలో ఒక ముసలి కోతివలె తయారైపోతావు. ఎంత కాలమైనా కూడను యీ దేహమనేది సత్యము కాదు. దీనిని ఆధారము చేసుకొని అహంకారమునకు అవకాశము యివ్వరాదు. క్రమక్రమేణా ప్రారంభమునుండి అహంకారమును అణగ తొక్కటానికి పూనుకోవాలి.

sri sathyasai vachanamrutam

**శాంతిని కావాలనుకున్న వ్యక్తి కోరికలను అదుపులో పెట్టుకోవాలి**

Start early, drive slowly, reach safely. అనేదానిలో అంతరార్థము యిదే! మనము ఈనాటినుండే కోర్కెలను అదుపులో పెట్టుకొని వుండాలి. చాలా మంది చూసే వుంటారు రైళ్లలో Less luggage more comfort, make travel a pleasure అని. ఈ లగేజి క్రమక్రమేణా తగ్గించుకుంటూపోవాలి. ఆ లగేజియే మన కోరికలు. ఈ కోరికలకు ఏమాత్రం అడ్డు లేదు, అంతు లేదు, మితిమీరిపోతున్నాయి. అమెరికాలో వుండిన కార్లు ఒక కారుపైన ఒక కారు ఒక కారుపైన ఒక కారు పెట్టేస్తే ఆకాశము నందుకుంటాయి, అక్కడ. దానికంటె అధికముగా పోతున్నాయి యీ కోరికలు. కనుక, కోరికలు అదుపులో పెట్టుకోండి. కోరికలు ఎంత అదుపులో పెట్టుకుంటామో మనకు శాంతి అంత అధికముగా వస్తుంది. శాంతి కావాలనుకున్న వ్యక్తి కోరికలను అదుపులో పెట్టుకోవాలి. ఆవు పెరిగేకొలది కొమ్ములు పెరుగుతాయి కదా! కోరికలు పెరిగి పెరిగి కట్టకడపటికి ఏనాడో ఒకనాడు అన్ని విధాలా భగ్నమై పోతుంది, జీవితం. అదే పిచ్చి పట్టటం. ధనవిషయములోగానీ అధికార విషయములోగానీ మితిమీరిన ఆశలు వుండరాదు. ఎంతవరకు మాత్రమో అంతవరకు వుండాలి. అహంకారముతో విఱ్ఱవీగి మన గౌరవమర్యాదలంతా మట్టి కలుపుకోటానికి ప్రయత్నించరాదు.

**ధనమెచ్చిన మదమెచ్చును**
**మదమెచ్చిన దుర్గుణములు మానక హెచ్చున్**
**ధనముడిగిన మదముడుగును**
**మదముడిగిన దుర్గుణములు మానును వేమా**

ఈ మదముతో సంచరించే మదపుటేనుగులయొక్క తత్త్వము ఏనాటికైనా హతము కావాలి. ఎంతమంది ఎన్ని విధములుగా జీవిస్తూ వచ్చారు, ఎన్ని విధములుగా ప్రవర్తించారు ఎంత అహంకారముతో జీవిస్తూ వచ్చారు! కానీ, వారందరు ఏరి ఈనాడు? ఇవన్నీ కదలిపోయే మేఘములు. వీటిని నమ్ముకొని మన జీవితమును వ్యర్థము చేసుకోరాదు. దైవమును విశ్వసించి, దైవమును స్మరించి, దైవమును ఆశ్రయించి, దైవమును అర్థము గావించుకొనే జీవిత తత్త్వమును అభివృద్ధిపరచుకోవాలి.

### మానవునకు తెలివితేటలు పెరిగేకొలది మానవత్వము దిగజారిపోతున్నది

"ఈ చిన్న వయస్సునందే మనకెందుకు, ఏ వృద్ధాప్యమునందో దైవచింతన చేసుకోవచ్చుకదా, యింకా కాలము దండిగ వుందికదా", అని మనము యోచించవచ్చు. కాలము దండిగ వున్నదనేదానికి ఏమి అర్థము? ఏమి నిదర్శనము? "నాకు ఆరోగ్యము బావుంది, ధనము చాలా బాగా వుంటుండాది, ఇంట్లో మంచిగానే వుంది, అధికార స్థితిలో వున్నాను,కాబట్టి యిప్పుడే చచ్చిపోను" అనుకోవడానికి వీలులేదు. మూడు అడుగులు వేసేటప్పటికి heart attack రావచ్చును. ఎవరు చెప్పగలరు? జీవితము కేవలము నీటిబుడగే! చెట్టుకొమ్మపై వున్న ఆకు చివరనున్న నీటి బిందువువంటిది. ఏ కించిత్ కదలిక వచ్చినా ఆ బిందువు కింద రాలిపోతుంది. కనుక దైవచింతన ఎప్పుడో ఎప్పుడో అనే పోస్టుపోన్‌మెంటు చేసుకోటానికి వీలుకాదు. ఎప్పటికప్పుడు మనము రెడీగా వుండాలి. అదే మనయొక్క జీవిత ధర్మము. నిర్మలంగా, నిశ్చలముగా, నిస్వార్థముగా పవిత్ర హృదయులై మీరు వుంటుండాలి. అట్టి మానవ జీవితమునకే 'జంతూనాం నరజన్మ దుర్లభమ్' అన్నారు. అలాంటి దుర్లభమైన మానవ జన్మ యెత్తికూడను పశుపక్షిమృగాదులకంటె హీనమైన మార్గములో మనము ప్రవర్తిస్తున్నాము. మృగములకు అసూయ లేదు. ఆస్తిపాస్తులున్నాయనే గర్వాలు లేవు. Bank balance అంతకంటే లేదు. జీతాలు వచ్చే మార్గము లేదు. ఎప్పటికప్పుడు భుజిస్తున్నాయి. హాయిగా చెట్లమీద పవళిస్తున్నాయి జీవితమును సంతోషముగా గడుపుతున్నాయి. మానవునికి తెలివితేటలు, సుజ్ఞాన ప్రజ్ఞాన విజ్ఞానములు అనుభవించుకొలది మానవత్వము మరింత దిగజారి పోతున్నది.

### హిరణ్యకశిపుడు హరిద్వేషి, ప్రహ్లాదుడు హరిప్రియుడు

విద్యార్థులారా! మీరుకూడను చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ప్రహ్లాదుడుకూడను ఒక విద్యార్థియే! అతడు కూడను అనేక విద్యలయందు అభివృద్ధి గావించాలని తండ్రియైన హిరణ్యకశిపుడు చాలా ప్రయత్నము చేశాడు. గొప్ప గొప్ప విద్వాంసులనంతా అతనికే గురువులుగా నియమించాడు. మీ యిష్టానుసారముగా శిక్షించి అభివృద్ధి మార్గములో పెట్టమని వారికి అప్పజెప్పాడు. చండామార్కులు గొప్ప పండితులే కాని, వారిచేతకూడను కాకపోయింది,

sri sathyasai vachanamrutam

అబ్బాయిని అరికట్టటం.కొంతకాలమునకు హిరణ్యకశిపుడు పిలిపించాడు, కుమారుని. పెరిగి బాలుడు బాగా పెద్దవాడైనాడు. చక్కగానే వుంటున్నాడు. దగ్గరకు పిలిచాడు తండ్రి. 'నాయనా! సక్రమముగా చదువుతున్నావా', అని కుశల ప్రశ్నలు వేశాడు. 'నాన్నా! ఆనందముగా చదువుతున్నా' నన్నాడు. గురువులు 'నీకు ఏమి చెప్పారో ఒక చిన్న పద్యమేమైనా చెప్పగలవా,' అన్నాడు హిరణ్యకశిపుడు.

**చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబులు నే**
**చదివినవి కలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!**

అన్నాడు.ఏదీ ఆ మర్మమేమిటో చెప్పమన్నాడు. 'హరి ఓం!' వచ్చింది, హిరణ్యకశిపునికి చిచ్చు. వెఱ్ఱివాడైనాడు. గురువులపైన, బిడ్డపైనా తాండవకేళి సలిపాడు. ఈ తండ్రికి, కుమారునికి మధ్య వున్న వ్యత్యాసము మీరే యోచించండి. హరిద్వేషి తండ్రి, హరిప్రియుడు ప్రహ్లాదుడు. జగత్తులో ఒక్కొక్క వ్యక్తియందు అనేక విధములైన శక్తి సామర్థ్యములు వ్యక్తమవుతూవుంటాయి. కనుకనే, మానవత్వములోపల గుర్తింపవలసినది దైవ ప్రేమనే! ఈ సత్యమును గుర్తించుకొని సర్వకర్మలు మీరు ఆచరించండి. దానిలో దోషము లేదు. భగవత్ ప్రేమ కలిగినవాడు చెడు కార్యములో ప్రవేశించడు. 'చెలగి మధువుగ్రోల చేదు రుచించునా' ? నిజముగా మధురమైన అమృతాన్ని చూచినవానికి చేదు ఏ మాత్రము యిష్టము వుండదు. ఖజ్జూరము తిన్నవానికి చింతపండు ఏమాత్రము యిష్టము వుండదు. నిజముగా భగవంతుని ప్రేమతత్త్వాన్ని గుర్తించుకోలేనివాడే ప్రకృతి విషయములపైన సవారి చేస్తూ వుంటాడు. ఈ సత్యాన్ని, నిత్యాన్ని, నిర్మలత్వాన్ని, తత్త్వమును మనము గుర్తించుకుంటే అసత్యమును, అనిత్యమును మనము ఏమాత్రము ఆశించము.

**కోరికలు లేని హృదయమునందే శాంతి నిండివుంటుంది**

మానవ జీవితము కేవలము తిండి తీర్థాదులకై వచ్చినది కాదు. భోగభాగ్యముల నిమిత్తమై ఏర్పడినది కాదు. త్యాగయోగములను అనుభవించాలి. అదే నిజమైన రహస్యము. అందరికి

## తేదీ. 09-01-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

ఉపకారమైన కర్మలలో మనము ప్రవేశించాలి. ఎవరిని మనము ద్వేషించరాదు. ఏ విధమైన బాధలకు మనము గురికారాదు. ఈ విధమైన గుణములు మనము పోషించుకున్నప్పుడే నిజమైన మానవత్వము వ్యక్తమవుతుంది. మానవుడు మానవుడని చెప్పుకుంటూ మానవాకారము ధరించి దానవులుగా ప్రవర్తించుకుంటుంటే యీ మానవత్వమునకే మసిపూసినట్లవుతుంది. ఎంతమంది ధనవంతులు లేరు? ప్రపంచములో ఎంతమంది అధికారులు లేరు? కాని, శాంతి వారియందున్నదా? లేదు, లేదు. పైకి నాటక మాడవచ్చునేకాని శాంతి కోరికలు లేని హృదయములోనే నివసిస్తుంది. శాంతియే మానవుని అలంకారము. శాంతియే మానవునియొక్క సున్నితమైన ఖడ్గము. ఇదియే మధురమైన సారము. ఈ సారమే రస స్వరూపము. 'రసోవైసః ' రస స్వరూపమైన శాంతి మనయందే వుంటున్నది. అట్టి శాంతిని, ఆనందమును మీరు అనుభవించాలనుకున్నప్పుడు కోరికలు క్రమక్రమేణా తగ్గించుకోండి. భగవచ్చింతన అభివృద్ధిపరచుకోండి. సేవాకార్యములలో పాల్గోండి. నిరంతరము మీరు సేవకులుగానే భావించాలిగానీ నాయకులుగా మారి అహంకారమునకు అవకాశము యివ్వరాదు. సేవకావృత్తిలోనే నిజమైన ఆనందము వుంటుండాది. నాయకత్వములో ఏమాత్రము ఆనందము లేదు. అది నిజమైన అధికారము కాదు.

అలాంటి దానిని మనము ఆశించరాదు. సమాజములో ప్రవేశించండి. దీనులకు సేవచేయండి. దీనులను, దిక్కులేనివారిని ఆదరించండి. ఇదియే మీరు నారాయణసేవగా భావించండి. ఇదే సరైన అవకాశము. దైవమును హృదయములో ప్రవేశపెట్టుకొని 'దిల్ మే రామ్, హాత్ మే కామ్' హృదయములో దైవమును, చేతులతో పనిని (సేవలు) చేయటానికి సిద్ధముగా వుంటుండాలి.

**(తేదీ. 09-01-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam